

డ్రై ఐపోతున్నాయ్..!
జిల్లాలో కొత్త ఆరోగ్య సమస్య తలెత్తుతోంది. జీజీహెచ్ నేత్ర విభాగానికి వచ్చే కేసుల్లో ప్రతి పది మందిలో 8 మందికి డ్రై ఐ సమస్య ఉంటోంది. - 8లో..



రామతీర్థాన్ని పరిశీలించిన కలెక్టర్
జిల్లాలోని రామతీర్థం ప్రాజెక్టును కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/25

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

21న అండర్ 11 చెస్ పోటీలు

ఒంగోలు: అండర్ 11 జిల్లా స్థాయి చదరంగ పోటీలు ఈనెల 21న స్థానిక ఐకాన్ గ్లోబల్ స్కూలులో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని జిల్లా స్థాయి విజేతలుగా ప్రకటించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని, 2013 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఆసక్తిగలవారు 9666725719 ను సంప్రదించాలన్నారు.

23న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

ఒంగోలు టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 23వ తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి.భరద్వాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం, భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, బ్యాంకింగ్ లోన్ ఆఫీసర్, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, తదితర సెక్టార్లలోని ఖాళీలను భర్తీ చేసేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా విభాగంలో డిప్లొమా, ఐటీఐ, టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఈ ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14,500 నుంచి రూ.21 వేల వరకు వేతనం ఇస్తారని, అదనంగా పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు కూడా ఇస్తారని వివరించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 08592 281776 ఫోన్ ద్వారా సంప్రదించగలరని తెలిపారు.

సాగు మెండుగా.. లాభం దండిగా..!

- పొగాకు సాగు పరిమితిని భారీగా పెంచిన టుబాకో బోర్డు
- ప్రకాశం రీజియన్‌లో 105.27 మిలియన్ కేజీలు పండించేందుకు అనుమతి
- గతేడాదితో పోలిస్తే 15.37 మిలియన్ కేజీలు అదనం
- ఒక్కో బ్యారన్ పరిమితి ఆరు క్వింటాళ్ల వరకు పెరిగిన వైనం
- అనధికారిక పొగాకు విక్రయాలపై స్పష్టత ఇవ్వని బోర్డు

అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు ఏర్పడిన డిమాండ్ జిల్లా రైతులకు దండిగా ఆదాయం తెచ్చిపెడుతోంది. మూడేళ్లుగా వేలంలో రికార్డు ధరలు నమోదవుతుండటంతో పొగాకు రైతుల పంట పండింది. గత రెండేళ్లుగా ఒకే పంట పరిమితిని కొనసాగించిన టుబాకో బోర్డు ఈ ఏడాది రైతుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుంది. ఈ ఏడాది పొగాకు సాగు పరిమితిని భారీగా పెంచుతూ టుబాకో బోర్డు నిర్ణయం తీసుకోవడం రైతులకు కలిసొచ్చే అంశం. 2023–24 సీజన్‌తో పోల్చుకుంటే ఈ దఫా 15.37 మిలియన్ కేజీలు అదనంగా పొగాకు పండించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యారన్ పరిమితిని కూడా దాదాపు 6 క్వింటాళ్ల వరకు పెంచింది. అయితే బోర్డు పరిమితిని దాటి పండించిన దాదాపు 50 మిలియన్ కేజీల పొగాకుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రకాశం జిల్లా రీజియన్ పరిధిలో రానున్న సీజన్‌కు 105.27 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇస్తూ పొగాకుబోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11వేలం కేంద్రాలున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒంగోలు–1, ఒంగోలు– 2, కొండెపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలు ఉండగా, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కందుకూరు–1, కందుకూరు– 2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలు ఉన్నాయి.వీటి పరిధిలో 2023–24లో పరిమితి 89.9 మిలియన్ కేజీలు. వచ్చే సీజన్ అంటే 2024–25లో దీనికి అదనంగా 15.37 మిలియన్ కేజీలు ఉత్పత్తి చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. అలాగే బ్యారన్ పరిమితిని కూడా భారీగానే పెంచింది. గతంలో ఎస్ఎల్ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు ఉంటే అది ఇప్పుడు 42.75 క్వింటాళ్లకు, ఎస్‌బీఎస్ పరిధిలో 35.50 క్వింటాళ్ల నుంచి 41.75 క్వింటాళ్ల ఉత్పత్తిని విక్రయించేలా బోర్డు నిర్ణయం తీసుకుంది. అంటే బ్యారన్‌కు దాదాపు 6 క్వింటాళ్ల వరకు పెంచినట్లు అయింది.

రైతుల్లో ఆనందం

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ దృష్ట్యా వేలం కేంద్రాల్లో రికార్డు ధరలు వస్తున్నాయి. దీంతో బోర్డు పమితికి మించి పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది 89 మిలియన్ కేజీలకు అనుమతినివ్వగా, లాభాలు వస్తుండటంతో రైతులు అదనంగా 50 మిలియన్ కేజీలు వెరసి మొత్తం 139 మిలియన్ కేజీలు సాగు చేశారు. ఈ నేపథ్యంలో బోర్డు



పొగాకు సాగు పరిమితిని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గత రెండు సీజన్లకు ఒకే పంట పరిమితిని కొనసాగించినా ఈ ఏడాది మాత్రం పంట పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ పొగాకు రూ 365ల వరకు పలుకుతోంది. దీంతో ఏడాది పొగాకు సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న బ్యారన్, పొలాలు కౌలు ధరలే ఇందుకు నిదర్శనం.

అనధికారికంపై వెలువడని నిర్ణయం

మరోపక్క అనధికారిక పొగాకు అమ్మకాలపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే 11 వేలం కేంద్రాల్లో 10 వేలం కేంద్రాల్లో అధికారిక అమ్మకాలు పూర్తయ్యాయి. అయితే అనధికారిక పొగాకు అమ్మకాలపై బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రస్తుతం ఈ అమ్మకాలు నిలిచాయి. సాధారణంగా 5 శాతం వరకు ఫెనాల్టీ విధిస్తుంది. అయితే గతేడాది దీనిని బోర్డు రద్దు చేసింది. కాని ఈ ఏడాది బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం వేలం ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. అదనంగా 50 మిలియన్ కేజీల అమ్మకాలపై రైతుల్లో ఆందోళన నెలకొంది. బోర్డు ఉన్నతాధికారులకు లేఖ రాశామని, త్వరలోనే బోర్డు నిర్ణయం తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

> **అనుమతి మేరకే సాగు చేసుకోవాలి**
> 2024–25 సీజన్‌కు పొగాకు పంట పరిమితిని పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుంది. రీజియన్ పరిధిలో ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ పరిధిలో దాదాపు 105 మిలియన్ కేజీలు పండించేందుకు బోర్డు అనుమతిచ్చింది. అయితే పొగాకు మార్కెట్ ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉంటాయి. రైతులు ఈ ఏడాది లాభాలను చూసి వచ్చే పంట సీజన్‌కు భారీగా పొగాకు సాగు చేయకుండా పంట నియంత్రణ పాటించాలి. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండిస్తే మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉంటాయి.
> – ఎం.లక్ష్మణరావు, టుబాకో బోర్డు ఆర్ఎం

జిల్లా అంతటా వాన

- ఈ నెల 21 వరకు కోస్తా ఆంధ్రాలో భారీ వర్షాలు
- వాతావరణ శాఖ ప్రకటనతో యంత్రాంగం అప్రమత్తం
- జిల్లాలో అత్యధికంగా తర్లుపాడులో 41.4 మి.మీ వర్షపాతం
- మొత్తంలో 253.8 మి.మీ వర్షపాతం నమోదు

ఒంగోలు అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఈ వర్షాలు పంటలకు నష్టం చేయవని అధికారులు చెబుతున్నారు. అల్పపీడనంతో ఈ నెల 21వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తమైంది. ఈ నెల మొత్తం మీద 87.9 మి.మీ వర్షపాతం ఉండాల్సి ఉండగా ఇప్పటికే 65.3 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లాలోని 39 మండలాలకు గాను 27 మండలాల్లో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తర్లుపాడులో 41.4 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నానికి 253.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలతో పాటు చల్లటి గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. జిల్లా కేంద్రం ఒంగోలులో డ్రైనేజీల్లోని పూడికలు తీయకపోవడంతో పలు ప్రాంతాల్లో కాలువల్లోని నీరు రోడ్లపైకి వచ్చింది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో ఆ ప్రాంతాల్లోని వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలోని తర్లుపాడు మండలంలో శుక్రవారం అత్యధికంగా 41.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మద్దిపాడు మండలంలో 1.2 మి.మీటర్లు నమోదైంది. ఇతర మండలాల్లో వర్షపాతం ఈ విధంగా ఉంది. కంభం 20.4, అర్ధవీడు 20.2, బేస్తవారిపేట 19.4, హనుమంతునిపాడు 16, మార్కాపురం 14.4, కొమరోలు 12.4, వెలిగండ్ల 12, రాచర్ల 11, కనిగిరి 10.6, పెద్దారవీడు 8.6, పామూరు 8.2, పీసీపల్లి 7.8, కొనకనమిట్ల 7, గిద్దలూరు 6.8, ఒంగోలు 6.2, ముండ్లమూరు, సీఎస్‌పురం 3.4, పొన్నలూరు 3.2, కొండపి, త్రిపురాంతకం 2.2, నాగులుప్పలపాడు, మద్దిపూడి, పుల్లలచెరువు మండలాల్లో 2, సంతనూతలపాడు, శింగరాయకొండల్లో 1.8, మద్దిపాడులో 1.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రతిభకు పట్టం

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తూ వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిభా పోటీలు నిర్వహిస్తోంది. సమాజానికి ఉపయోగపడే అంశాలకు సంబంధించి శాస్త్రీయత ఆధారంగా ఆలోచనలకు పదును పెట్టి విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులకు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు అందజేస్తూ వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తోంది. 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చు.

- సృజనాత్మకతకు పదును పెట్టేందుకే ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు
- పాఠశాల స్థాయి నుంచే మెదడుకు పదును పెట్టే అవకాశం
- జిల్లా స్థాయి మొదలు జాతీయ స్థాయి వరకు పోటీలు
- జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైతే రూ.10 వేలు
- రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే రూ.25 వేలు
- జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులకు పేటెంట్‌కు అవకాశం


జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు (ఫైల్)

ఒంగోలు: సృజనాత్మకతకు పదును పెట్టేందుకు జాతీయ స్థాయిలో కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, సంయుక్తంగా ఏటా ఇన్‌స్పైర్ మనక్ పోటీలను జిల్లా స్థాయి మొదలు జాతీయ స్థాయి వరకు నిర్వహిస్తున్నాయి. ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్) మనక్ (మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జి) పేరుతో 10 లక్షల మంది విద్యార్థుల మెదళ్ల నుంచి వచ్చే శాస్త్రీయమైన అంశాల ఆధారంగా సామాజిక ప్రయోజనాలు ఆశిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో మాత్రమే ఈ పోటీలకు అర్హులు. అంటే 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో తమ ప్రతిభ చాటుకోవచ్చు.

ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు:
యాజమాన్యంతో సంబంధం లేకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 3 ప్రాజెక్టులను (6,7,8 తరగతులు), ఉన్నత పాఠశాల (6 నుంచి 10 తరగతులు) నుంచి 5 ప్రాజెక్టులు ఆహ్వానిస్తారు. వీరికి సైన్స్ టీచర్ గైడ్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. సమాజానికి ఉపయోగపడే అంశాలపై శాస్త్రీయత ఆధారంగా ప్రాజెక్టు నమూనా రూపొందించాలి. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్వచ్ఛభారత్, క్లీన్ ఇండియా, సమాజాభివృద్ధి అనే అంశాలతో ఈ ప్రాజెక్టులు ఉండాలి. వీరు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్–డీఎస్‌టీ. జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాల లాగిన్ ద్వారా దీనిని పంపాలి. డీఈవో కార్యాలయం ఆమోదం లభించిన తరువాత ఈమెయిల్, యూజర్ ఐడీలో లింక్ సాయంతో పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని ప్రాజెక్టు నమూనాను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ప్రోత్సాహకం ఇలా:
దాదాపు 10 లక్షల ప్రాజెక్టులకు అవకాశం కల్పిస్తారు. జిల్లా స్థాయిల్లో దేశవ్యాప్తంగా లక్ష ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో వెయ్యి ప్రాజెక్టులు, జాతీయ స్థాయిలో 60 ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుకు విద్యార్థి బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు జమచేస్తుంది. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు రూ.25 వేలు అందిస్తారు. రాష్ట్ర స్థాయికి ఎంపికై జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొని అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు. వీరు ప్రధానమంత్రి, రాష్ట్రపతిని కలుసుకునే అవకాశం కల్పిస్తారు. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుల్లో కొన్ని ప్రాజెక్టులను ఎంపికచేసి వాటికి పేటెంట్ హక్కులు కూడా కల్పించేందుకు విద్యార్థికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. దేశవ్యాప్తంగా 240 మంది జాతీయస్థాయి విజేతలకు సంబంధించిన ప్రాజెక్టులను పేటెంట్ హక్కుల కోసం ప్రతిపాదిస్తే వాటిలో 26 ప్రాజెక్టులకు పేటెంట్ హక్కులు లభించాయి. 15 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి ఉన్న విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం లభిస్తుంది. 2020–21లో తిమ్మాయిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పి.వెంకట లక్ష్మి ఆదిత్య జాతీయ స్థాయికి ఎంపికకాగా, 2021–22లో పుల్లలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.నిఖిల్‌చంద్ జాతీయస్థాయికి ఎంపిక కావడమే కాకుండా అక్కడ కూడా విజేతగా నిలిచి ప్రకాశం జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశాడు.

దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్:
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్-డీఎస్‌టీ.జీవోవీ.ఇన్
దరఖాస్తులకు తుది గడువు: సెప్టెంబర్ 15

గతంలో ప్రకాశం జిల్లా నుంచి

సంవత్సరం	జిల్లా నుంచి ప్రతిపాదించిన ప్రాజెక్టులు	జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు	రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు	జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు
2020–21	1700	153	15	1
2021–22	1563	173	18	1
2022–23	1700	183	18	1
2023–24	2053	203	210	నిర్వహించాల్సి ఉంది


జాతీయస్థాయి ప్రాజెక్టుతో విద్యార్థి (ఫైల్)

> **ప్రతి పాఠశాల నుంచి ప్రాతినిధ్యం ఉండాలి**
> 
> జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రతిపాదనలు ఉండాలి. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇదో మంచి సువర్ణావకాశం. విద్యార్థుల్లో సమాజం పట్ల మంచి స్పృహను కల్పించడం ద్వారా వారిలో పరిశోధనాత్మక కోణాన్ని వెలికితీయడం సాధ్యపడుతుంది. సెప్టెంబర్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు దీనిని బాధ్యతగా తీసుకుని విద్యార్థులను ప్రోత్సహించాలని కోరుతున్నాం. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి నెంబర్ 9666955504ను సంప్రదించవచ్చు.
> – టి.రమేష్, జిల్లా సైన్స్ అధికారి

ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు చేయాలి


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ట్రెజరీ, ఆడిట్, ఎండోమెంట్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలన్నీ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అవినీతికి తావు లేకుండా చిత్తశుద్ధితో ప్రజల అవసరాలు తీర్చాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, కమర్షియల్ టాక్స్ ఏసీ కరీంబాషా, జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాథరావు, స్టేట్ ఆడిట్ అధికారి నాగశ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డి, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఈత సరదా

- చెరువులో పడి యువకుల గల్లంతు
- ఒకరు మృతి, మరొకరి కోసం వెతుకులాట


మృతిచెందిన నల్లమలపు నవీన్


గల్లంతైన బాణాల వెంకటేష్


వల్లూరు చెరువులో మృతదేహాల కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం


నవీన్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

టంగుటూరు: ఈతకొట్టేందుకు వెళ్లి ఇద్దరు యువకులు చెరువులోకి దిగి ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతైన ఘటన టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. యువకుల కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వాసేపల్లిపాడు గ్రామానికి చెందిన నల్లమలపు నవీన్ (23), బాణాల వెంకటేష్ (శాంబాబు) (22) ఇద్దరూ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. వల్లూరు చెరువు పడమటి వైపు ఈత కొట్టేందుకు వచ్చి నీటిలో దిగారు. చెరువులో లోతు ఉండటంతో నీటిలో గల్లంతయ్యారు. వారు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై పున్నారావు యువకుల సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా వల్లూరు చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం చెరువు సమీపంలో ద్విచక్ర వాహనం ఉండటంతో పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో చెరువులో గాలించగా నవీన్ మృతదేహం బయటపడింది. వెంకటేష్ మృతదేహం లభ్యం కాలేదు. రాత్రి 7 గంటల వరకు గాలించినా ఫలితం లేకపోయింది. చీకటి పడటంతో ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు నిలిపేశారు. దీంతో వాసేపల్లిపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పున్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, గెస్ట్ టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డి.జయ తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఫిజిక్స్-1, మ్యాథ్స్-2, ఇంగ్లీషు-1, హిందీ-1, సివిక్స్-1 మరియు ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు పీఈటీ-5, జీఎస్ఎం నర్సు-1(పురుషులు)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. సంబంధిత సబ్జెక్టులు బోధించేందుకు పీజీలో 55 శాతం మార్కులు, బీఈడీ, టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని స్పష్టం చేశారు. డిగ్రీ, పీజీలు ఇంగ్లిష్ మీడియంలో చదివిన వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. బాలికల విద్యాలయం, కళాశాలలో బోధించేందుకు మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు ఈనెల 31న చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

'అగ్నివీర్' సెలెక్షన్‌కు 28 వరకు గడువు

ఒంగోలు టౌన్: అగ్నివీర్‌లో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసేందుకు ఇంటర్మీడియెట్ ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథ్స్‌లో 50 శాతం మార్కులు లేదా మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా తత్సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవివాహిత యువతీ యువకులు అర్హులని, ఎంపిక ప్రక్రియ మూడంచెల్లో ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 08592 281776ను సంప్రదించాలని సూచించారు.



డ్రై ఐపోతున్నాయ్!

- జీజీహెచ్‌కు వచ్చే కేసుల్లో ప్రతి 10 మందిలో 8 మందికి 'డ్రై ఐ'
- మొబైల్ ఫోన్ విపరీతంగా చూడటం కూడా ఓ కారణమే..
- జీవనశైలి మార్పుతో ముంచుకొస్తున్న కొత్త సమస్య

ఒంగోలు టౌన్:

జిల్లాలో కొత్త ఆరోగ్య సమస్య తలెత్తుతోందా అంటే అవుననే చెబుతున్నారు వైద్యులు. మారిన జీవన శైలి పుణ్యమా అంటూ ప్రజల కళ్లల్లో నీళ్లు మాయమైపోతున్నాయి.! అంటే పొడిబారిపోతున్నాయన్నమాట.

జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని నేత్ర విభాగంలో చికిత్స కోసం రోజూ కనీసం 180 నుంచి 200 మంది వరకు వస్తున్నారు. వీరిలో ప్రతి 10 మందిలో 8 మందికి కళ్లు పొడారిపోతున్నాయి. స్కూలు పిల్లల నుంచి మొదలుకుని యువకులు, వృద్ధులు, మోనోపాజ్ దశకు చేరుకున్న మహిళలు, సుగర్ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్ల దాటిన వారిలో ఎక్కువగా ఈ సమస్య కనిపిస్తోందని, వైద్య పరిభాషలో దీనిని డ్రై ఐ సిండ్రోం అంటారని జాతీయ అంధత్వ నివారణ సంస్థ జిల్లా వైద్యాధికారి సుమయ్య ఖాన్ పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యల గురించి ఆమె వివరించారు.

కారణం ఏమిటంటే..?

మారిన జీవన శైలిలో డిజిటల్ గాడ్జెట్స్ వినియోగం పెరిగింది. పగలు రాత్రి అనే తేడా లేకుండా గంటల తరబడి మొబైల్ ఫోన్ చూడడం ఒక వ్యసనంలా మారింది. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ట్యాబ్స్‌లోనే చదువుకోవాల్సి వస్తోంది. ఆఫీసులో కూడా కంప్యూటర్‌లోనే పని చేయాల్సి రావడం వల్ల కళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ గాడ్జెట్లతోనే గడపాల్సి వస్తోంది. అందులోని రేడియేషన్ ప్రభావం వల్ల కళ్లు పొడారిపోతున్నాయి. ఎక్కువగా పొయ్యి దగ్గర ఉంటే మహిళలు, వంట పనిచేసేవారితోపాటుగా పొలం పని చేసే వారు కూడా ఈ సమస్యతో బాధపడుతున్నారు.



లక్షణాలివే..

కళ్లు పొడిబారి పోవడం వల్ల నలక పడినట్లు అనిపిస్తుంది. కళ్లు గుచ్చుకుంటుండంతో తరచుగా కళ్లు నలుపుతుంటారు. మరికొందరికి కళ్ల నుంచి విపరీతంగా నీరు కారుతుంది. చేత్తో కళ్లు తుడుస్తుంటారు. ఇలా చేయడం వలన సమస్య మరింత జఠిలం అవుతుంది. ఒక్కోసారి కంటిలోని నరాలు దెబ్బతింటాయి. కాబట్టి కళ్లు నలపడం, రుద్దడం లాంటివి చేయకూడదు. ఇంకొందరైతే కంటిలో మట్టి లాంటిది పడిందని నాటు వైద్యుల దగ్గరకు వెళ్లి నాలుకతో మట్టి తీయించడం చేస్తుంటారు. ఇది ప్రమాదకరం.

ఏమి చేయాలంటే..

- చల్లటి నీళ్లతో కళ్ల మీద నీళ్లు చల్లు కోవాలి. దీనివలన కంటి రెప్పలలో రక్త ప్రసరణ పెరుగుతుంది. కళ్లు ఎనర్జిటిక్ అవుతాయి.
- కనుగుడ్డు అటు ఇటు గుండ్రంగా తిప్పాలి.
- చల్లటి శుభ్రమైన గుడ్డను కళ్లపై ఉంచుకోవాలి.
- కంప్యూటర్ ముందు నుంచి కానీ, మొబైల్ ఫోన్ నుంచి కానీ ప్రతి 20 నిముషాలకోసారి 20 నిముషాల పాటు బ్రేక్ తీసుకోవాలి. 20 అడుగుల దూరం నుంచి దృశ్యాన్ని చూడాలి. దీన్ని ట్వంటి ట్వంటీ సిస్టమ్ అంటారు. దీని వలన కంటి మీద ఒత్తిడి తగ్గుతుంది. ఉపశమనం దొరుకుతుంది.
- సమస్య ఎక్కువగా వేధిస్తుంటే నేత్ర వైద్య నిపుణుల సలహా ప్రకారం లూబ్రికెంట్ డ్రాప్స్ వాడాలి.
- సుగర్ వ్యాధిగ్రస్తులైతే ఆహార నియమాలను పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలి.
- వైద్యుడి సలహా తీసుకుని యాంటీ రిఫ్లెక్టెడ్ కోటింగ్ కలిగిన కళ్లజోళ్లు వాడాలి.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



చర్మం, నోరు పొడిబారినట్లే కళ్లు కూడా పొడిబారుతుంటాయి. గతంలో ఈ సమస్య అరుదుగా కనిపించేది. ఇప్పుడు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం పెరగడంతో రేడియేషన్ ప్రభావంతో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరు కంటి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రతలు తీసుకోవాలి. రిఫ్లెక్టెడ్ కంటి అద్దాలు వాడటం వల్ల గాడ్జెట్స్ నుంచి రక్షణ కల్పిస్తుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నేత్రాలను పరీక్షించుకోవాలి. వీలైనంత మేరకు మొబైల్ ఫోన్, కంప్యూటర్‌కు కాస్త దూరంగా ఉండేందుకు ప్రయత్నించడం ఉత్తమం.

– డా. సుమయ్య ఖాన్, జిల్లా వైద్యాధికారిణి, జాతీయ అంధత్వ నివారణ సంస్థ

మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- ఒంగోలు టూటౌన్, మహిళా పోలీసు స్టేషన్ల తనిఖీ

ఒంగోలు టౌన్: మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తామని, అందుకనుగుణంగా పోలీసు స్టేషన్ల పనితీరును మారుస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, మహిళల భద్రత, రక్షణ కోసం పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మహిళల ఫిర్యాదులను వీలైంత త్వరగా పరిష్కరించాలన్నారు. పోలీసు స్టేషన్లో పనిచేసే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసు స్టేషన్, టూటౌన్ పోలీసు స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు, జనరల్ డైరీ, రిజిస్టర్లను పరిశీలించారు. పోలీసు స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల గురించి తెలుసుకుని, పలు సూచనలిచ్చారు. ఆయా పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తులో పురోగతి గురించి తెలుసుకున్నారు. తనిఖీ సందర్భంగా పోలీసు స్టేషన్లో ఉన్న ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

ప్రత్యేక టీంలుగా ఏర్పడాలి

కేసుల ఛేదనకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక టీంలుగా ఏర్పడాలని ఎస్పీ సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా రుంచాలని దిశానిర్దేశం చేశారు. నేరాలు కట్టడి చేయాలని, విజిబుల్ పోలిసింగ్ నిర్వహించాలని చెప్పారు. ఎస్పీ వెంట ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్ ఉన్నారు.

స్కానింగ్ గదుల్లో దేవుడి బొమ్మలొద్దు

- మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: స్కానింగ్ చేసే గదుల్లో ఎటువంటి దేవుడి బొమ్మలు పెట్టవద్దని మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన ఒంగోలు నగరంలోని వివిధ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కాన్ రూం బయట లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీసీ పీఎన్‌డీటీ చట్టం నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన వైద్యులు, సిబ్బంది వివరాలు అందుబాటులో ఉంచాలని, ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే జిల్లా వైద్యశాఖ అధికారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. స్కానింగ్ తీయించుకున్న వారి వివరాలు రోజూ ఫామ్-ఎఫ్‌లో పూర్తి చేసి వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, హార్డు కాపీలను అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కాలం ముగిసేందుకు నెల ముందుగానే రెన్యువల్ చే యించుకోవాలని, అనుమతి పొందకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో మాస్ మీడియా ఉప అధికారి సరోజిని, సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులో ఓ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న శ్రీనివాసులు

శ్రీశైలం ఘాట్‌లో
రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ఆర్టీసీ, మినీ ట్రావెల్ బస్సులు
- ట్రావెల్ బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ జ్ఞానేశ్వర్

పెద్దదోర్నాల: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ట్రావెల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం శ్రీశైలం ఘాట్ రోడ్డులోని బోడేనాయక్ తండా వద్ద చోటుచేసుకుంది. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. శ్రీశైలంలో దైవ దర్శనం ముగించుకుని దోర్నాల వైపునకు వస్తున్న మినీ ట్రావెల్స్ బస్సు, శ్రీశైలం వైపునకు వెళ్తున్న విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుణావత్ జ్ఞానేశ్వర్ కుడికాలుకు తీవ్ర గాయాలు కాగా, మరి కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న మొబైల్ టీం సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. మినీ బస్సు డ్రైవర్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

- డాక్టర్ జీవీ రంగారావుకు తీవ్ర గాయాలు

రాచర్ల: కారు బోల్తా పడి డాక్టర్‌కు తీవ్రగాయాలైన సంఘటన రాచర్ల మండలంలోని చర్లోపల్లె గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై చోటుచేసుకుంది. వివరాలు.. గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ బీవీ రంగారావు పల్నాడు జిల్లా వైద్య విధాన పరిషత్ హాస్పిటల్లో జిల్లా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పల్నాడు జిల్లా నుంచి కారులో గిద్దలూరుకు వస్తున్న సమయంలో చర్లోపల్లె గ్రామ సమీపంలో అదుపు తప్పి కారు బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ బీవీ రంగారావు తీవ్రంగా గాయపడ్డారు. గిద్దలూరు ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. డాక్టర్ రంగారావు గతంలో గిద్దలూరు, కంభం, మాచర్ల, బాపట్ల ప్రభుత్వ వైద్యశాలల్లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు.




రోడ్డు మార్జిన్‌లో ఉన్న కారు

సింగరాయకొండ సర్పంచ్‌పై కక్ష సాధింపు

- నిధుల గోల్‌మాల్ పేరుతో షోకాజ్ నోటీసు జారీ
- డీపీఓ తీరును తప్పుబట్టిన సర్పంచ్ వనజ
- న్యాయ పోరాటం చేస్తానని స్పష్టీకరణ

సింగరాయకొండ: సింగరాయకొండ మేజర్ పంచాయతీలో నిధులు గోల్‌మాల్ జరిగాయంటూ సర్పంచ్ తాటిపర్తి వనజకు శుక్రవారం డీపీఓ టి.ఉషారాణి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పంచాయతీ నిధులు రూ.45 లక్షలు గోల్‌మాల్ జరిగాయని, వీటిలో సుమారు 13 లక్షలకు పూర్తి ఆధారాలు లేవని దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే చెక్‌పవర్ రద్దు చేస్తామని ఆ షోకాజ్ నోటీసులో డీపీఓ పేర్కొన్నారు. నోటీస్‌పై సర్పంచ్ వనజను వివరణ కోరగా.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నిరాధారమైన ఆరోపణలపై తనకు నోటీసు ఇచ్చారని మండిపడ్డారు. రూ.45 లక్షలు గోల్‌మాల్ అయ్యాయని ఓ రౌడీషీటర్ ఆరోపిస్తే, రికార్డులు పరిశీలించకుండానే రాజకీయ ఒత్తిళ్లతో నోటీసులివ్వడమేంటని ప్రశ్నించారు. గతంలో విచారణాధికారి కనిగిరి డీఎల్‌పీఓ ఇచ్చిన నివేదికలో తనపై ఎలాంటి చర్యలకు సిఫార్సు చేయలేదని, కానీ డీపీఓ ఇచ్చిన షోకాజ్ నోటీసులో మాత్రం 2023లో తనకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొనడాన్ని తప్పుబట్టారు. తాను దాదాపు 20 పర్యాయాలకు పైగా డీపీఓ కార్యాలయానికి వెళ్లి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిని ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా ఓ గుమస్తాను అప్‌గ్రేడ్ చేసి కార్యదర్శిగా బాధ్యతలు ఇచ్చారని ఆరోపించారు. రికార్డుల నిర్వహణ తెలియని గుమస్తాను వదిలేసి, ఎలాంటి సంబంధం లేని తనకు నోటీసులివ్వడం సరికాదన్నారు. డీపీఓ కార్యాలయ రికార్డులు తనిఖీ చేయకుండా షోకాజ్ నోటీసు జారీ చేయడంపై సర్పంచ్ వనజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో ఈఓ శరత్‌కుమార్‌కు, అప్పటి గుమస్తాకు ఈ రూ.13 లక్షలకు సంబంధించి రికవరీకి సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపై డీపీఓకు వివరణ ఇవ్వడంతో పాటు న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.





ఈఓ శరత్‌కుమార్, గుమస్తా శైలజకు గతంలో జారీ చేసిన షోకాజ్ నోటీసులు

రామతీర్థాన్ని పరిశీలించిన కలెక్టర్



రామతీర్థం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

చీమకుర్తి: రామతీర్థం రిజర్వాయర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం నీటి లభ్యత వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి స్కీం పంపింగ్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. భోజన నాణ్యత, హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు సంధించి బోధనా ప్రమాణాల స్థాయిని తెలుసుకున్నారు. స్టూడెంట్ కిట్స్ పంపిణీపై ఆరా తీశారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యను బోధించాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, ప్రాజెక్ట్ ఎస్ఈ అబుత్ ఆలీ, తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు, ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.364

- పొదిలిలో మాత్రమే కొనసాగుతున్న కొనుగోలు
- ఒంగోలులో చూర కొనుగోలు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర శుక్రవారం గరిష్టంగా కేజీ రూ.364 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలిలో పొగాకు బేళ్లు, ఒంగోలు కేంద్రంలో చూర కొనుగోలు చేస్తున్నారని ఆర్ఎం తెలిపారు. పొదిలి కేంద్రంలో 104వ రోజు వేలం పాటలో 543 బేళ్లు రాగా, 448 బేళ్లు కొనుగోలయ్యాయి. 95 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.364, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.300.95 పలికింది. ఒంగోలులో చూర కొనుగోలు చేస్తున్నారు. అందులో 565 బేళ్లు రాగా, 513 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 52 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.139, కనిష్టంగా రూ.60 సరాసరి రూ.87.88 వచ్చిందని తెలిపారు.



పొదిలి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

పోలేరమ్మ తాళిబొట్లు మాయం

- వెండి వస్తువులు, మైక్‌సెట్ కూడా..

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామంలో పోలేరమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై పున్నారావు కథనం మేరకు.. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి తాళిబొట్లు, హుండీలోని నగదు, రెండు మైకులు, ఆంప్లిఫయర్, వెండి గ్లాస్, వెండి స్పూన్ అపహరించారు. క్లూస్ టీం బృందం శుక్రవారం సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 11వ తేదీ గురువారం అర్ధరాత్రి చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ మరుసటి రోజు వచ్చి గుడిని పరిశీలించి వెళ్లారని, ఆ తర్వాత పోలీసుల నుంచి ఎటువంటి సమాచారం లేదని గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల తర్వాత వచ్చి ఆధారాలు సేకరించారని, నిందితులను వేగంగా గుర్తించి శిక్షించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈదా వెంకటరెడ్డి, ఎంపీటీసీ బుర్రా అంకరాజు, గుడి పెద్దలు కోరారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్సై పున్నారావు